క్లుప్తంగా

లక్ష్మీనరసింహుడి సేవలో మాజీ ఎమ్మెల్యే



పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని ఆదివారం నియోజకవర్గం ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరన్న, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుంకేనాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామంలో సోమవారం ఉదయం 6 గంటలకు విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

వైభవంగా ఉజ్జినప్ప, రాకెట్లప్పస్వామి పట్టమ దేవర



ఉజ్జినప్ప, రాకెట్లప్ప దేవుళ్ల ఊరేగింపు

ఉరవకొండ: పట్టణంలో ఉజ్జినప్ప, రాకెట్లప్ప స్వాముల పట్టమ దేవర కార్యక్రమాన్ని ఆదివారం వేలాది మంది భక్తుల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉజ్జినప్ప, రాకెట్లప్ప ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక గవిమఠం ప్రాంగణం నుంచి పట్టణంలో ఊరేగించారు. పాతపేటలోని రాకెట్లప్ప, ఉజ్జినప్ప ఆలయం వద్దకు చేరుకుని స్వాముల మహా పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నలమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రేపు మండల సమావేశం

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ యాదవేంద్ర ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలాభివృద్ధి ప్రధాన అంశంగా నిర్వహించే సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు, సలహా సంఘాల చైర్మన్లు హాజరు కావాలన్నారు.

సర్పంచుకు పరామర్శ



సర్పంచును పరామర్శిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు సర్పంచు పి.శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి పరామర్శిం చారు. కొద్దిరోజుల క్రితం ఆయన కూడేరు మండలం గొటుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగుళూరులో చికిత్స తీసుకుని ఇటీవల స్వగ్రామానికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆ గ్రామానికి చేరుకుని సర్పంచును పరామర్శించారు. బీసీ విభాగం అధ్యక్షుడు సీపీ వీరన్న, ఉపాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, ఉస్మాన్, సర్పంచులు భూమా కమలమ్మ, శివాజీనాయక్, నాయకులు సురేష్, లాలుస్వామి, గోపాల్‌రెడ్డి, బోయ పాండు, ఆదెప్ప, విశ్వనాథ్‌రెడ్డి, ప్యాపిలి కిష్ట, సామానాయక్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు



ఎమ్మార్సీలో భద్రపరిచిన పాఠ్య పుస్తకాలు

కూడేరు: 2023–24 ఏడాదికి సంబంధించి ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందించనున్న పాఠ్య పుస్తకాలు రెండు రోజులు క్రితం మండలానికి వచ్చేశాయి. పుస్తకాలు స్థానిక ఎమ్మార్సీలో భద్ర పరిచారు. మండలానికి మొత్తం 43,687 పుస్తకాలు రావాల్సి ఉండగా తొలి విడుతలో ప్రభుత్వం 15,787 పుస్తకాలు పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మిగిలిన పుస్తకాలు త్వరలోనే సరఫరా అవుతాయన్నారు. సరఫరా అయిన పుస్తకాలను ఆయన పరిశీలించారు.

యంత్రంతో కోత .. ఖర్చుల మోత!

- రైతుకు భారంగా వరి నూర్పిడి
- సిండికేట్‌గా యంత్ర నిర్వాహకులు



బీటీపీ ఆయకట్టులో వరి కోత కోస్తున్న యంత్రం

రాయదుర్గం: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు.. కూలీల కొరత వెరసి బీటీపీ ఆయకట్టులో కోతకొచ్చిన వరి పొలాలకు యంత్రాలే ఆదరువయ్యాయి. దీన్ని అవకాశంగా తీసుకున్న వరి కోత యంత్రాల నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడి రైతులపై ఆర్థిక భారం మోపేలా వ్యవహరిస్తున్నారు. గంటల ప్రకారం నూర్పిడి పనులు చేపట్టేలా రైతులతో ఒప్పందం కుదుర్చుకుని యంత్రాలను పొలాల్లో దింపుతున్నారు. గంటకు రూ.2,800 నుంచి రూ.3,000 వరకూ వసూలు చేస్తున్నారు. సాధారణంగా హెచ్ఎల్‌సీ ఆయకట్టు ప్రాంతాల్లో ఎకరం నూర్పిడికి 1:30 లేదా 2 గంటలలోపే సమయం పడుతుంది. కానీ చిన్న మడుల సాకుతో 3 నుంచి 3:30 గంటల వరకూ సమయం తీసుకుంటున్నారు. దీని ప్రకారం ఎకరం కోతకు ఎంత తక్కువన్నా రైతులు రూ.10,500కు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈదురు గాలులు, వర్షాలకు వరి నేలకొరిగి ఉంటే ఎకరం 4 గంటలు పట్టే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అద్దెకు కొందరు, కమీషన్లకు కొందరు దళారులు యంత్రాలను కొనసాగిస్తున్నారు. గతంలో రూ.2 వేలు నుంచి రూ.2,500 ఉన్న ధరలను అమాంతంగా పెంచి రూ.3 వేలకు చేర్చారు. పదెకరాలున్న రైతు కేవలం కోతకు మాత్రమే రూ.లక్షకు పైగా చెల్లించుకోవాల్సి వస్తోంది.

దృష్టి సారించిన అధికారులు..

రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వ్యవసాయాధికారులు వరి కోత యంత్రాల పై దృష్టి సారించారు. గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లోని బీటీపీ ఆయకట్టులో ఎన్ని వరి కోత యంత్రాలు ఉన్నాయి..? వాటి యజమానులు, లీజుదారులు ఎవరు..? అనే విషయం పై అధికారులు ఆరా తీస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా వ్యవహరించే యంత్ర యజమానులపై చర్యలు చేపట్టడంతో సీజ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

పెరిగిన దిగుబడి

బీటీపీ ఆయకట్టులో సారవంతమైన భూములుండడంతో దిగుబడులు గణనీయంగా పెరిగాయి. ఎకరాకు 45 నుంచి 55 బస్తాల వరకు దిగుబడులు రావడం, క్వింటాల్ వరి రూ.2 వేలకు పైగా పలకడం లాంటి కారణాలు రైతుకు కలిసొచ్చింది. అధికారులు సక్రమంగా నీరందించడం, సకాలంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం, చీడపీడల నివారణకు నిరంతం కృషి చేయడంతో దిగుబడులకు ఊతమిచ్చినట్టైందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేశారు.

2,130 హెక్టార్లలో వరి సాగు..

రాయదుర్గం డివిజన్‌లోని రబీలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 3110 హెక్టార్లు కాగా, ఈ ఏడాది హెచ్ఎల్‌సీ తో పాటు బీటీపీ ఆయకట్టు కలిపి 2,130 హెక్టార్లలో వరి పంటలు సాగులోకి వచ్చాయి. అన్నీ చోట్ల ఆశించిన స్థాయిలో దిగుబడులు చేతికందడం.. ధరలు కాస్త ఊరట నివ్వడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్నారు.

రైతులపై భారం మోపితే చర్యలు



నూర్పిడి యంత్రాల యజమానులు రైతులపై భారం మోపేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపడతాం. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి యంత్రాల నిర్వాహకులు కుతంత్రాలకు పాల్పడితే సీజ్ చేసేలా ఆదేశాలిస్తాం. రైతులు, యంత్ర నిర్వాహకుల ఆమోదయోగ్యంగా ధరలు నిర్ణయించి సకాలంలో కోతలు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం. 2 గంటలు పట్టే కొతను 4 గంటలు చేస్తే ఊపేక్షించేది లేదు. రైతుల విజ్ఞప్తి మేరకు పరిశీలించి చర్యలు చేపడతాం. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంట ఉత్పత్తులు కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలు వహించాలి.

– లక్ష్మానాయక్, ఏడీఏ, రాయదుర్గం

విత్తన వేరుశనగకు 381 మంది రిజిస్ట్రేషన్

వజ్రకరూరు: మండలంలో సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం 381 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు మండల వ్యవసాయ అధికారి మధుకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాయితీ వేరుశనగ కోసం 381మంది రైతులు 340 క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 40 శాతం రాయితీ వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామన్నారు. కే6 రకంతో పాటు లేపాక్షి రకానికి చెందిన వేరుశనగను రైతులకు అందజేస్తామన్నారు. కే6 రకం వేరుశనగకు రాయితీ పోనూ 30 కిలోల బస్తాకు రైతు రూ.1,674 చెల్లించాలన్నారు. లేపాక్షి రకం వేరుశనగ బస్తాకు రాయితీ పోనూ రూ.1494 చెల్లించాలన్నారు.

నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే చర్యలు

కుందుర్పి: నిషేధిత పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఏడీఏ యల్లప్ప హెచ్చరించారు. ఆదివారం నియోజకవర్గంలోని పలు పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ప్రతి దుకాణంలో స్టాక్ రిజిష్టర్ తప్పనిసరిగా ఉంచాలని, పురుగు మందులు విక్రయించిన వెంటనే రైతుకు రసీదు ఇవ్వాలలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కుందుర్పిలో పలు దుకాణాల్లో ఎలాంటి రసీదులు ఇవ్వకుండా అధిక ధరలకు పురుగు మందులు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, త్వరలోనే విజిలెన్స్ బృందంచే తనిఖీలు చేట్టనున్నట్లు ఏడీఏ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా గాలిగోపుర నిర్మాణ పనులు



గోపురాల నిర్మాణానికి ఉపయోగించే రాళ్లపై శిల్పాలు చెక్కుతున్న దృశ్యం

కూడేరు: దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రాల్లో ఒక్కటిగా పేరొందిన కూడేరులోని శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద ఉత్తరం–దక్షణం వైపు గాలి గోపురాలను నిర్మించేందుకు బళ్లారికి చెందిన భక్తుడు బసన్న గౌడ్ ముందుకు వచ్చాడు. బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి గోపురాల నిర్మాణానికి విలువైన రాతిని తెప్పించాడు. ప్రస్తుతం గాలి గోపురాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నైపుణ్యం కల్గిన వ్యక్తులతో రాతి నిలువులపై శిల్పాలను చెక్కిస్తున్నారు. బసన్న గౌడ్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా జోడులింగాలను కొలుస్తున్నామన్నారు. మొక్కుగా గాలి గోపురాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. గోపురాల ఏర్పాటుకు సుమారు రూ.80 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశామన్నారు. నిర్మాణ పనుల్లో గ్రామస్తులు, భక్తులు సలహాలు, సూచనలివ్వాలని ఆయన కోరారు.

వేరుశనగ పంటకు పందుల బెడద



కొలిమిపాళ్యం సమీపంలో విత్తనాలను తోడేసిన అడవి పందులు

కుందుర్పి: మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసిన పంటలను అడవి పందులు రాత్రిళ్లు ధ్వంసం చేస్తూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జంబుగుంపల, కుందురిృ, అప్పిలేపల్లి, బెస్తరపల్లి, ఎనుములదొడ్డి తదితర 16 గ్రామాల పరిధిలో అటవీ ప్రాంతాలు ఉండడంతో అడవి పందులు స్థావరాలు ఏర్పాటు చేసుకుని పొలాల్లో సాగుచేసిన పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. పక్షం రోజులుగా రైతులు బోరుబావుల కింద ఖరీఫ్ వేరుశెనగ పంటను సాగుచేస్తున్నారు. వేరుశనగ విత్తిన రాత్రే అడవి పందులు ఎకరాల కొద్దీ నోటి సాయంతో విత్తనాలను తోడేస్తున్నాయని రైతులు వాపోయారు. అటవీశాఖ అధికారులు స్పందించి అడవి పందులబారి నుంచి పంటలను రక్షించాలని రైతులు కోరుతున్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



మాట్లాడుతున్న వక్తలు

వజ్రకరూరు: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, బాగా చదువుకుని గ్రామానికి మంచిపేరు తేవాలని వక్తలు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మునెమ్మ అధ్యక్షతన 14వ రోజు సమ్మర్ క్యాంపు ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా ఏర్పా టు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలు అందుకోవాలని, గ్రామానికి పేరు ప్రతిష్ట తీసుకు రావాలని సూచించారు. రోజూ గ్రంథాలయాన్ని సందర్శించి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం, క్యారమ్స్, చెస్, క్రికెట్ తదితర ఆటలు ఆడించారు. కార్యక్రమంలో నేతాజీ అవార్డు గ్రహీత బెంజిమెన్, రిటైర్డు ఎంపీహెచ్ఈఓ పట్టా ఖాజాపీరా, సామాజిక ఉద్యమకారుడు కుమార్, రిసోర్స్‌పర్సన్ మహబూబ్‌బాషా, అల్లాబకస్, వలి తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరలతో రక్తహీనతను నివారించవచ్చు

కుందుర్పి: కూరగాయలు, ఆకు కూరలతో విద్యార్థులు, చిన్నారుల్లో రక్తహీనతను నియంత్రించవచ్చని హైస్కూల్ హెచ్ఎం నాగరాజు, గ్రంథాలయ అసిస్టెంట్ భాస్కర్ సూచించారు.ఆదివారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం చిన్నారుల్లో రక్తహీనతను నిర్మూలించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కూరగాయలు, ఆకుకూరలు తినడం వల్ల రక్తహీనత నివారణతో పాటు అనేక రకాల వ్యాధులను దూరం చేయవచ్చన్నారు.అలాగే వ్యాయామం, సూర్యరశ్మి వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది రామచంద్రప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

కూడేరు: మండలంలోని కలగళ్ల ఎస్సీ కాలనీలో గ్రామస్తుల సహకారంతో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు అంబేడ్కర్ చిత్ర పటాన్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు చంద్రాయుడు, కిరణ్, పెన్నోబులేసు, నరసింహులు, చితంబరం, గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి, హనుమంతరాయుడు, వివిధ కుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కణేకల్లు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమణ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ ప్రవేశానికి అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించామన్నారు. జూన్ 14లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలో హెచ్ఈసీ, సీఈసీ, ఎంపీసీ, బైపీసీతోపాటు ఒకేషనల్ (ఆఫీస్ అసిస్టెంట్ షిప్) కోర్సులున్నాయన్నారు. దరఖాస్తుతోపాటు ఆధార్, రేషన్‌కార్డుతోపాటు మార్క్స్ కార్డు, స్టడీ, టీసీ, కులం–ఆదాయం, బ్యాంకు అకౌంట్, నాలుగు పాస్ ఫొటోలు అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు.

శుభకార్యం

బొమ్మనహాళ్: మండలంలోని దుద్దేకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల రామాంజినేయులు కుమారుడు భాస్కర్ – భారతి వివాహ వేడుకకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ తలారి రామాంజనేయులు, సర్పంచ్ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయదుర్గం: పట్టణంలోని కణేకల్లు రోడ్డు లో పిడుగుపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను విప్ కాపు రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి కాపు భారతి ఆదివారం పరామర్శించారు. వారి ఆరోగ్య స్థితిగతులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్సలు అందించడంతో పాటు నిరంతం వారిపట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే అనంతపురానికి రెఫర్ చేసి టైలర్ వెంకటేశులు ఆరోగ్య పరిస్థితిని కూడా సర్వజనాస్పత్రి సూపరిండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏ లోటు రానీకుండా చూసుకోవాలని ఆదేశించారు. అలాగే మృతి చెందిన వ్యక్తి పోస్టుమార్టం సకాలంలో పూర్తి చేయించి.. మృతదేహాన్ని బంధువులకు అప్పగించేలా కృషి చేశారు. విప్ కాపు దంపతులు దగ్గరుండి సొంత మనుషుల్లా చూసుకున్నారని, వారికి రుణపడి ఉంటామంటూ బాధితుల బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కూడేరు: మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి బొలెరో వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఘటనలో చోళసముద్రానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వాహనదారుల సమాచారం మేరకు క్షతగాత్రున్ని 108 వాహనంలో చికిత్స నిమిత్తం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవాలి



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని అనంతపురం కిమ్స్ సవీరా ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రరెడ్డి హాజరై రోగులతో మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యమే మహా భాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఆరోగ్యం బాగుంటే రూ.కోట్ల సంపద ఉన్నట్లేనన్నారు. ప్రతి ఒక్కరూ పౌష్టిక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. ప్రజాసేవ కోసం కాపు రామచంద్రారెడ్డి కుటుంబం నిస్వార్థంగా సేవలు అందిస్తుందన్నారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 8 మందికి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నట్లు వైద్యుడు సురేష్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గౌని కాంతరెడ్డి,ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీ గోవింద్, నాయకులు ఖాజా హుస్సేన్, రాజశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, వన్నూర్‌స్వామి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్ల ఢీ.. ఆరుగురికి గాయాలు



నుజ్జయిన కారు

డి హీరేహాళ్(రాయదుర్గం): బళ్లారి– బెంగళూరు జాతీయ రహదారిలోని డి హీరేహాళ్ మండల కేంద్రం పోలీస్‌స్టేషన్ సమీపాన ఆదివారం వేకువజామున రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ కారు నుజ్జయింది. వివరాలు.. బెంగళూరు నుంచి బళ్లారి వైపు ఓ కారు వెళ్తుండగా, వెనుక నుంచి మరో కారు ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో ముందు కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడగా, వెనుక కార్లో ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో బళ్లారి విమ్స్‌కు తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

'దుర్గం'లో భారీ వర్షం



ధర్మపురిలో కూలిన విద్యుత్ స్తంభాలు

రాయదుర్గం: పట్టణంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుముల శబ్దానికి ప్రజలు తలుపులు తీసేందుకు సైతం ప్రజలు భీతిల్లిపోయారు. పైభాగాన్నున్న కొండ ప్రాంతం నుంచి శాంతీనగర్ మీదుగా వరదనీరు దిగువకు వచ్చి చేరుతుండడంతో రామస్వామి, కొలిమివీధి, మధుటాకీస్ ఏరియా తో పాటు మరిన్ని లోతట్టు ప్రాంతాలకు చేరింది. ఈ కారణంగా ఇళ్లలోని వస్తు సామగ్రి ముంపుకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే నియోజకవర్గం లోని గుమ్మఘట్ట, డి హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్ ప్రాంతాల్లోనూ పలు చోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపుతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల రహదారులకు అడ్డంగా చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సాధ్యమైనంత వరకూ కరెంట్ సరఫరా పునరుద్ధరించేలా అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. అవసరమైన ప్రాంతాల్లో పంటలు ఏవైనా దెబ్బతిని ఉంటే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరపనున్నారు.

గాలీవానకు కూలిన విద్యుత్ స్తంభాలు

వజ్రకరూరు: మండలంలోని ధర్మపురి గ్రామంలో ఆదివారం సాయంత్రం కురిసిన గాలీవానకు విద్యుత్ స్తంభాలు కూలాయి. వర్షంతోపాటు తీవ్రమైన గాలికి గ్రామంలోని జగనన్న కాలనీ, ఇందిరమ్మ కాలనీ, పొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో పలు కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, వజ్రకరూరు పీఏసీఎస్ చైర్మన్ సుధీర్ రెడ్డి తదితరులు విద్యుత్ స్తంభాలు కూలిన ప్రాంతాలను పరిశీలించి విషయాన్ని ట్రాన్స్ కో ఏఈ చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లారు. విద్యుత్ అధికారులు గ్రామాని కి చేరుకుని మరమ్మతులు ప్రారంభించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వజ్రకరూరు: మండలంలో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా పిడుగులుపడినా, వర్షానికి నష్టం వాటిల్లినా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

వడదెబ్బ.. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు

- జాగ్రత్తలు తప్పనిసరి
- ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పి.మాధవి



రాయదుర్గంటౌన్: రోజురోజుకూ ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతోంది. మండు వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి. వడదెబ్బ లక్షణాలు తెలుసుకుని సరైన సమయంలో జాగ్రత్తలు పాటించి చికిత్సలు పొందాల్సిన అవసరం ఉంది. వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సలపై రాయదుర్గం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పి.మాధవిని 'సాక్షి' సంప్రదించగా క్షుణ్ణంగా వివరించారు. వడదెబ్బ పట్ల నిర్లక్ష్యం వహిస్తే మనిషి ప్రాణానికే ప్రమాదమన్నారు. ముఖ్యంగా ఎండలో పనిచేసే కూలీలు, వృద్ధులకు వడదెబ్బ తగిలే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అధిక ఉష్ణోగ్రతకు శరీరంలోని నీరు, లవణాల శాతం తగ్గిపోవడంతో కలిగే అనారోగ్య లక్షణాలనే వడదెబ్బ అంటారన్నారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీ పెట్టుకోవడం ద్వారా ఎండ నుంచి రక్షణ పొందవచ్చన్నారు. శరీరం వేడిక్కినట్లు గుర్తిస్తే చల్లని నీటిలో స్నానం చేయాలన్నారు. తరచూ నీరు తాగాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్న పిల్లలకు, వృద్ధులు ఎండవేడిమి తగలకుండా చూసుకోవాలి.

లక్షణాలు:

- శరీరం పాలిపోయి కళావిహీనమవుతుంది.
- శరీర ఉష్ణోగ్రత అత్యధికస్థాయికి చేరుకుని, అనంతరం సాధారణ స్థాయి కన్నా తక్కువకు పడిపోతుంది.
- శరీరంలోని లవణాలు తగ్గిపోవడంతో సమతుల్యత లోపించి తలనొప్పి, తలతిరుగుట, జ్వరం కలిగి ఉండడం, మత్తు నిద్ర, ఫిట్స్ లేదా పూర్తి అపస్మారకస్థితి లాంటి లక్షణాలు కనిపిస్తాయి.
- నీరు చెమటరూపంలో పోవడం నిర్జలీకరణ(డీహైడ్రేషన్) జరిగి మూత్రం రావడం కష్టమవుతుంది.
- కొన్ని సందర్భాలో షాక్‌కు గురై మూర్ఛపోవడం, మరణం కూడా సంభవిస్తుంది.

చికిత్స ఇలా..

- వడదెబ్బ తగిలిన వ్యక్తి దుస్తులు వదులు చేసి గాలి బాగా తగిలేలా బయలు ప్రదేశంలో ఎండ తగలకుండా చూడాలి.
- సేద తీరిన తర్వాత సాధ్యమైనంత త్వరగా చల్లని ద్రవ పదార్థాలను తాగించాలి.
- శరీరమంతా తడిగుడ్డతో బాగా తడపాలి.
- మజ్జిగ, ఉప్పు కలిపిన నిమ్మఎలక్ట్రోలైట్ ద్రావణం తాగించాలి.
- శరీరం ఉష్ణోగ్రత సాధారణం కంటే ఎక్కువగాఉన్నచో పారసిటమోల్ మాత్ర ఇవ్వాలి
- చల్లని నీటిని తరుచూ తాగిస్తూ ఫ్యాను గాలిసోకేలా వ్యక్తిని విశ్రాంతి ఇవ్వాలి.
- షాక్‌కు గురైన సందర్భాల్లో పై ఉపశమన చర్యలు పాటిస్తూ వెంటనే ఆస్పత్రికి తరలించాలి.